నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

నేడు కరెంట్ సరఫరాకు అంతరాయం

- ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు కట్

నవతెలంగాణ-నిజామాబాద్

నగరంలోని వినాయక్‌నగర్‌లోని విద్యుత్ ఉప కేంద్రంలో ఉన్న 8.00ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిని 12.5 ఎంవీఏ పెంచడానికి నేడు(మంగళవారం) పనులు చేపట్టనున్నట్టు ఏడీఈ 3వ టౌన్ వీరేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం నెలకొననున్నట్టు తెలిపారు. వినాయక్‌నగర్, పులాంగ్, గాయత్రినగర్, కోటగల్లి, జెండాగల్లి, శ్రీ సాయి కృపానగర్, జెండాగల్లి, శ్రీనగర్ ,100 ఫీట్ రోడ్డు, పద్మానగర్, హనుమాన్‌నగర్, సాయినగర్, చంద్రనగర్, బడాబజార్, పాటిగల్లి, యాదగిరి బాగ్, న్యాల్‌కల్‌రోడ్డు, గూడెం, ఓల్డ్ హౌసింగ్ బోర్డు తదితర ఏరియాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం కలగనుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిఖం భూమి పరిశీలించిన ఆర్డీవో

నవతెలంగాణ-మాక్లూర్


భూములు పరిశీలిస్తున్న ఆర్డీవో

మండలంలోని చిన్నాపూర్ గ్రామంలోని తిర్మన్ చెరువు కబ్జాకు గురి కావడంతో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నాపూర్ గ్రామంలోని తీర్మాన్ చెరువు కబ్జాకు గురై, పట్టా కూడా చేసుకున్నారని గ్రామస్థులు తహశీల్దార్ కార్యాలయం ముందు నాలుగు రోజుల క్రితం ధర్నా నిర్వహించారు. సోమవారం ఘటనా స్థలానికి వచ్చి పరిశీలిస్తామని గ్రామస్తులకు తహశీల్దార్ హామీ ఇవ్వడంతో సోమవారం ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. 438/ఉ, 439 సర్వే శిఖం భూమి కబ్జాకు గురైందా.. లేదా అని పరిశీలించారు. కబ్జాకు గురైనట్టైతే పట్టాను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ షబ్బీర్, ఆర్ఐ షఫీ, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


విచారణ చేపట్టిన మహిళా వైద్యాధికారులు

షాహీన్ ఆస్పత్రిలో విచారణ

- ఒక్క ఆస్పత్రే తనిఖీ.. మరో రెండు విస్మరణ
- అధికారుల తీరుపై అనుమానలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని పలు ప్రయివేటు ఆస్పత్రులు వైద్య తీరు ఇటీవల వివాదాస్పదం అయిన విషయం విధితమే. గర్భిణీకి నిర్వహించిన గర్భస్రావం వికటించి ఓ ఆస్పత్రిలో గర్భిణీ మృతిచెందగా, చాతి నొప్పితో ఆస్పత్రిలో చేరిన యువకుడికి సకాలంలో శస్త్ర చికిత్స చేయకపోవడంతో మృతిచెందాడు. మరో ఘటనలో ఓ మహిళకు అనుమతి లేకుండానే గర్భసంచి తొలగించడం వివాదాస్పదమయింది. ఈ ఘటనలపై అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి. కాగా పై మూడు ఘటనలు ఇటీవల చోటుచేసుకోగా.. అధికారులు మాత్రం ఒక్క ఆస్పత్రిలోనే సోమవారం విచారణ చేపట్టడం గమనార్హం. మరో రెండు ఆస్పత్రులపై ఇప్పటి వరకు కనీసం విచారణ చేపట్టకపోవడంతో ఆంతర్యమేంటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

నిజామాబాద్ నగరంలోని ఖిల్లా ప్రాంతంలో గల షాహిన్ ఆసుపత్రిలో డాక్టర్ సనుబర్ రెహమాన్ చేసిన చికిత్స మేరకు మహిళ గర్భం కోల్పోయినట్టు ఫిర్యాదు అందింది. సదరు ఫిర్యాదుపై కలెక్టర్, వైద్యఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు డాక్టర్ అంజన, డాక్టర్ లావణ్య సోమవారం సదరు ఆస్పత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. గర్భసంచిని ఎందుకు తొలగించవలసిన అవసరం వచ్చింది..? తీసివేయడానికి గల కారణాలు ఏమిటి అనే అంశం పై విచారించారు. సహకరించిన నర్సు చేసిన చికిత్స ఏమిటి తదితర అంశాలను విచారణ చేపట్టినట్టు తెలిపారు.

అక్రమార్కులే పాటదారులు

- నాటకీయంగా ఇసుక వేలం

నవతెలంగాణ-పిట్లం


వేలం నిర్వహిస్తున్న తహసీల్దార్

బిచ్కుంద మండలం పుల్కల్ (మంజీరా) గ్రామం నుండి పిట్లం మండల కేంద్రం వైపు ఇటీవల అక్రమ రవాణాకు పాల్పడిన 3 ట్రాక్టర్ల అక్రమ ఇసుకను పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా పట్టుకొని సీజ్ చేయడంతో వేలం పాట అనివార్యమైంది. ఇసుకను వేలంలో దక్కించుకునేందుకు సదరు అక్రమార్కులే హాజరు కావడం విశేషం. పిట్లం మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఇసుక వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో పలువురు పాల్గొనగా, అందులో అక్రమ రవాణా ఇసుకకు పాల్పడిన ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్‌లు సైతం పాల్గొనడం విశేషం. కాగా వేలంపాటలో ఒక ట్రాక్టర్ ఇసుకకు సర్కార్ సవాల్ 920 రూపాయలను తహసిల్ కార్యాలయ సిబ్బంది నిర్ణయించింది. ఒక ట్రాక్టర్ ఇసుకకు త్రిముఖ పోటీ నెలకొన్నప్పటికీ చివరకు ఓ వ్యక్తి 2800కు దక్కించుకున్నారు. మరో ట్రాక్టర్ ఇసుక వేలం పాట నిర్వహించగా రూ.1600, ఇంకో ఇసుక ట్రాక్టర్‌కు 2000 రూపాయలకు పలువురు ఆశావహులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

అటు ఆదేశాలు.. ఇటు ఆందోళనలు

- అధికారుల చర్యలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు కుదరని పొంతన
- సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన
- బీబీపేట్, నిజాంసాగర్‌లో రాస్తారోకో
- ధాన్యం ఎక్కడికుప్పలు అక్కడే ఉంటున్నట్టు ఆవేదన



నిజాంసాగర్‌లో రాస్తారోకో చేపట్టిన రైతులతో మాట్లాడుతున్న పోలీసులు, అధికారులు.. బీబీపేట్‌లో రాస్తారోకో చేపట్టి నినాదాలు చేస్తున్న రైతులు

నవతెలంగాణ-దోమకొండ/నిజాంసాగర్

ధాన్యం సకాలంలో తూకం వేస్తూ ఎప్పటికప్పుడూ ట్యాగింగ్ చేస్తూ రైస్‌మిల్లులకు తరలించాలని ఒక వైపు అధికారులు ఆదేశాలు జారీ చేస్తూ ఉంటే.. మరో వైపు అదే డిమాండ్‌తో రైతులు ఆందోళన చేస్తున్నారు. సకాలంలో ధాన్యం అన్‌లోడ్ చేసుకుంటూ లారీలను ఎప్పటికప్పుడు పంపాలని రైస్‌మిల్లర్లతో సమీక్షలు నిర్వహిస్తూ ఆదేశాలు జారీ చేస్తుంటే.. మరో వైపు లారీలు సకాలంలో రాక తూకం వేసిన ధాన్యం సైతం తడిచి ముద్దవుతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు నిర్వహిస్తున్న సమీక్షలకు, ఇస్తున్న ఆదేశాలకు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలకు పొంతన కుదరడం లేదని రైతుల ఆందోళనతో తేటతెల్లమవుతుంది. తాజాగా సోమవారం బీబీపేట్, నిజాంసాగర్ మండలాల్లో రైతులు ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని రాస్తారోకో, ఆందోళనలు చేపట్టారు.

సకాలంలో తూకం వేయడం లేదని..

దోమకొండ : ధాన్యం సేకరణ త్వరగా చేపట్టడం లేదని వాపోతూ బీబీపేట్ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల నిర్లక్ష్యం వల్ల, లారీల కొరత వల్ల గత కొన్ని రోజుల నుండి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం మ్యాచర్ వచ్చినా సకాలంలో కాంటా వేయకపోవడంతో వర్షాలకు ధాన్యం తడసి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో లారీలు రప్పించి తరలించకపోవడంతో తూకం వేసిన ధాన్యం సైతం తడిచి ముద్దయిందని రైతులు వాపోయారు. రైతులు ధర్నా చేస్తున్నా సమాచారం తెలుసుకొని అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి.. ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఎక్కడి కుప్పలు అక్కడే

నిజాంసాగర్ : నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట సొసైటీ పరిధిలోని మాగి గ్రామానికి చెందిన రైతులు సోమవారం నిజాంసాగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన తూకం కంటే ఎక్కువగా జోకుతున్నారని దీంతో తీవ్రంగా నష్టపోతున్నట్టు వాపోయారు. కొనుగోలు సైతం నెమ్మదిగా సాగుతున్నాయని, ధాన్యం కుప్పలు ఎక్కడికక్కడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం సకాలంలో తూకం వేయాలని, తరుగు పేరిట లూటీ చేయడం మానాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో ఇరు వైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న నిజాంసాగర్ మండల రెవెన్యూ అధికారి బిక్షపతి, ఎస్సై సుధాకర్ ఘటన స్థలానికి చేరుకొని రైతులకు సముదాయించారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో అచ్చంపేట సొసైటీ సీఈఓ సంగమేశ్వర్ గౌడ్‌ను అక్కడకు రప్పించారు. రైతుల డిమాండ్‌లకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలకు
కోటి 9 లక్షల 41 వేలు మంజూరు

- 25 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు
- ఎంపిడిఓ బాలకృష్ణ

నవతెలంగాణ-ధర్పల్లి


చర్చిస్తున్న ఎంపీడీవో

అమ్మ ఆదర్శపాఠశాలల్లోని కనీస మౌలిక సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని, దీంతో మండలంలోని 25 పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలు పరిష్కారం కానున్నాయని ఎంపీడీఓ బాల కృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని వాడి, హొన్నాజీపేట్, కర్నల్ తండా, తదిత పాఠశాలల్లో ఉన్న సమస్యలపై ఉపాధ్యాయులతోపాటు, కార్యదర్శులు, గ్రామపెద్దలతో చర్చించారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి ఈవిద్యాసంవత్సర ప్రారంభం కాకముందే పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కార్య చరణ చేస్తున్నామని తెలిపారు. వీటిలో ముఖ్యంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్ల మరమత్తులు, ఇతరత్రా చిన్న,చిన్న మరమత్తులు చేపట్టనున్నామని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా కనీస సౌకర్యాలు కల్పించేందుకు పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పనుల ప్రారంభించగా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మైలారం, కేశారం, రామడుగు, చల్లగర్గ, ఎసిబి తండా, మొండి చింతరల్ తండా, డబ్ తండా, మరియా తండా, బిల్యా తండా, గుడి తండా, ఇంద్ర నగర్ తండా, రూప్ సింగ్ తండా, కోటపల్లి, ధర్పల్లి, హొన్నజీపేట్, వాడి, గోవింద్ పల్లి,తదితర గ్రామాల్లోని అమ్మ పాఠశాలల్లో జూన్ మొదటి వారం వరకు పనులు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

జీలుగతో భూమికి సారం

- పంట భూములు నిస్సారం నుంచి సారవంతం
- పంటలు వేసే ముందు పచ్చిరొట్టె సాగుకు రైతుల ఆసక్తి

నవతెలంగాణ-ఏర్గట్ల/రామారెడ్డి



అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడకం పెరిగింది. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద తగ్గడంతో భూమికి సేంద్రియ ఎరువుల కొరత నెలకొంది. ఈ క్రమంలో రసాయనిక ఎరువులను విరివిగా వినియోగడంతో పంట దిగుబడులు పెరగక పోగా భూమిలో పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. పంట భూములు నిస్సారంగా మారుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించి సుస్థిరమైన దిగుబడులు పొందాలంటే భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుతూ, సేంద్రియ ఎరువులను పోషకాల యాజమన్యంలో ఒక భాగంగా చేయాల్సిన అవసరం ఉంది. ఈ మధ్యకాలంలో సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, వర్మీకంపోస్టు లభ్యత నానాటికి తగ్గిపోతున్న తరుణంలో రైతులు జీలుగ(పచ్చిరొట్ట) పైర్ల సాగును పంటల సరళి ఒక భాగంగా చేసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. కాగా పలువురు రైతులు పచ్చిరొట్టె పైర్ల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. పంటలు వేయడానికి ముందు జీలుగ సాగుతో రైతులకు అధిక పంట దిగుబడి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు.

60 శాతం రాయితీపై విత్తనాలు

వ్యవసాయ శాఖ 60 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచింది. భౌతిక స్థితి మెరుగుపడే నేలకు నీటిని, పోషకాలను నిలుపుకొనే సామర్థ్యం పెరుగుతుంది. నేలలో కలియ దున్నిన పంట కుళ్లేటపుడు విడుదల చేసే ఆమ్లాల వల్ల నేలలో మొక్కలకు భాస్వరం, పొటాష్ అందడమే గాక గాల్లోని నత్రజని నెలలో స్థిరీకరించ బడ ుతుంది. నేల సారం పెరుగుతుంది. సమస్యాత్మక నేలలు కొంత మేర బాగుపడ తాయి. సూక్ష్మ పోషకాలు మొక్కకు లభ్యమై పంట ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి వస్తాయి. భూమికి సేంద్రియ పదార్థం అందడం వల్ల నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి తద్వారా పంట వేర్ల ఆరోగ్యం, పట్టుత్వం పెరుగుతుంది.

పూత దశలో కలియదున్నాలి

పచ్చిరొట్ట ఎరువులను పూత దశలో నేలలో కలియదున్నాలి. ఆ సమయంలో ఎకరానికి 50 కేజీల సూపర్ ఫాస్పెట్ వేస్తే త్వరగా కుళ్ళిపోతుంది. ప్రధాన పంటకు 50 కిలోల ఎరువును తగ్గించి వాడవచ్చు. పచ్చిరొట్ట మురగకుండా వేరే పంటలు వేయకూడదు. పచ్చిరొట్ట పూర్తిగా మురిగిన తర్వాత నీటిని తొలగించి కొత్తనీరు పెట్టాలి. పచ్చిరొట్ట సాగు చేసే పొలాల్లో నత్రజని తక్కువగా ఉంటే ఎకరానికి ఎనిమిది కిలోల నత్రజని వేయడం వల్ల మొక్క ఏపుగా పెరిగి రొట్ట ఎక్కువగా వస్తుంది. జనుము ఎకరాన 16 నుండి 24 కిలోలు వాడితే, 6 నుండి 9 నత్రజని, 1 నుంచి 2 భాస్వరం, 7 నుండి 10 పొటాష్ లభిస్తుంది, జీలుగ 12 నుంచి 24 కిలోలు ఎకరాన వాడితే 5 నుండి 7 నత్రజని, 1 నుంచి 1.5 బాస్వరం, 7 నుండి 8 పొటాష్ లభిస్తుంది.

పచ్చిరొట్ట(జీలుగ)పైర్లతో రైతుకు లాభాలు ఇలా



- భూమి భౌతిక, రసాయన, జీవ లక్షణాలు వద్ధి చెందుతాయి
- తక్కువ ఖర్చుతో నేలకు సేంద్రియ పదార్థాన్ని ఎక్కువ మోతాదులో అందించే వీలు కలుగుతుంది,నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే శక్తి పెరుగుతుంది.
- నేల గుల్లబారి, గాలి ప్రసారం పెరగడంతో పాటు, మురుగు నీటి వ్యవస్థ మెరుగుపడుతుంది.
- సేంద్రియ పదార్థం నేలకు అందడం వలన నేలలో సూక్ష్మజీవులు వద్ధి చెంది, అనేక జీవ రసాయన చర్యలు జరిగి, లభ్యం కాని స్థితిలో ఉన్న పోషకాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయి.
- పచ్చిరొట్ట(జీలుగ) పైర్ల సాగువలన పంటలకు చీడపీడల ఉధతి తగ్గుతుంది.
- పచ్చిరొట్ట(జీలుగ) పైర్లను కలియదున్నడం వలన తరువాత వేసే పంటకు సిఫారుసు చేసిన
- నత్రజనిని 25 శాతం వరకు తగ్గించి వాడుకోవచ్చు.
- పచ్చిరొట్ట(జీలుగ) పైర్ల సాగు వలన చౌడు నేలలను కూడా పునరుద్ధరించుకొని, ఆ నేలల ఉత్పాదకతను పెంచుకోవచ్చు.

పచ్చిరొట్ట(జీలుగ) పైరుకు ఉండాల్సిన లక్షణాలు:

- త్వరగా పెరిగి ఎక్కువ పచ్చిరొట్టను ఇచ్చేలా ఉండాలి.
- పచ్చిరొట్ట పీచు పదార్థం తక్కువగా ఉండి, నేలలో కలియదున్నేటప్పుడు త్వరగా కుళ్ళి భూమిలో కలిసేటట్లు ఉండాలి.
- పప్పుజాతి పంటలను ఎంపిక చేసుకొంటే, వేరుబుడిపెల ద్వారా గాలిలోని నత్రజనిని స్థిరీకరిస్తుంది.
- ఎంపిక చేసుకునే పైరు లోతైన వేరు వ్యవస్థ కలిగి, నీటి ఎద్దడిని తట్టుకొని, త్వరగా పెరిగి, కలుపు మొక్కలను అరికట్టేలా ఉండాలి.
- అన్ని రకాలైన నేలల్లోనూ ఏపుగా పెరిగి, నమ్మకమైన పచ్చిరొట్ట దిగుబడినిచ్చేలా ఉండాలి.

భూమిలో నత్రజని స్థిరీకరణ

అబ్దుల్ మాలిక్. ఏర్గట్ల మండల వ్యవసాయాధికారి



చౌడు భూములు, వరి పండించే భూములకు అనుకూలం. తేలికపాటి, ఇసుక నేలల్లో సాగు చేయవచ్చు, వేరు బుడిపెల ఎక్కువగా ఉండి, నత్రజని స్థిరీకరణ ఎక్కువ చేస్తుంది. ఎకరానికి 12-15 కిలోల విత్తనం అవసరం. దీనిని పూత దశలో కలియదున్నడం వలన ఎకరానికి 8-10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో సుమారు 6 కిలోల నత్రజని, 1-1.5 కిలోల భాస్వరం, కిలోల పొటాష్ ఉంటాయి.

మంచి దిగుబడులు

సోమ హరీష్ కుమార్. మండల వ్యవసాయ అధికారి. రామారెడ్డి



గ్రామీణ ప్రాంతాల్లో సాగు భూమికి తగినంత సేంద్రియ ఎరువులు లేక, రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల నేల భూసారాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోయి, పైరుకు అనేక రకాల తెగుళ్ల సోకుతున్నాయి. సేంద్రియ ఎరువులు ఏర్పాటు చేసుకొనడానికి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. పచ్చి రొట్ట విత్తనాలను సాగు చేసి నేలకు సారవంతాన్ని అందించి, అధిక దిగుబడి పొంది రైతులు లబ్ది పొందాలి.

పంచాయతీ సిబ్బంది
బకాయి వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్


మాట్లాడుతున్న నూర్జహాన్

నవతెలంగాణ-కోటగిరి

నిజామాబాద్ జిల్లాలో గత ఎనిమిది నెలల నుండి పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించలేదని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు అడిగితే.. పని చేయాలనుకుంటే చెయ్యి లేదా లేకుంటే పని మానేయ్ అని బెదిరిస్తున్నారని, జీతాలు లేకుండా సిబ్బంది ఎలా పని చేస్తారో అధికారులే చెప్పాలని డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

సిబ్బందికి 8 నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పులు తెచ్చుకొని పస్తువులతో జీవనం వెలదీస్తున్నారని తెలిపారు. ఇంటి అద్దె, కరెంట్ బిల్లు, పిల్లల ఫీజు, పాల బిల్లు, కరెంటు బిల్లు ,నిత్యవసర సరుకులు ఎక్కడినుండి తేవాలో అధికారులు చెప్పాలని, ప్రభుత్వం ఎలా బతకాల్లో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బకాయి జీతాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు ప్రభుత్వాలు ఎన్ని మారినా ఉద్యోగ భద్రత లేదని అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ చట్టబద్ధమైన సౌకర్యాలు లేవని, గత ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానంతో తీవ్ర పని ఒత్తిడి పెంచిందని ఉదయం 7:00 నుంచి సాయంత్రం 7:00 వరకు ఎండలు మండుతున్న పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. వేతనాల చెల్లింపులు మాత్రం ఏ అధికారి బాధ్యత తీసుకోవడం లేదని, గత ప్రభుత్వం అన్ని తరగతుల ఉద్యోగులకు వేతనాలు పెంచి జీవో నెంబర్ 60 ప్రకారం చెల్లింపులు జరుపుతూ కేవలం గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులను మాత్రం పక్కన పెట్టిందని వెల్లడించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని జీవో నెంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటీ సౌకర్యాలను కల్పించాలని, ఆదివారం పండుగ సెలవులు అమలు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు రాజేశ్వరి, మండల కోశాధికారి రజిని, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

అధ్వాన్నంగా డ్రైనేజీలు


చెత్తచెదారం పేరుకుపోయిన డ్రైనేజీ

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని బోర్గం పి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లె దారితోపాటు ఈదారిగుండా బోర్గం నుండి మోపాల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే డ్రైనేజీ అధ్వానంగా ఉంది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండి కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి డ్రైనేజ్ సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వన్నెల్‌దాస్ లక్ష్యకు పద్మశాలి ప్రతిభా పురస్కారం


ప్రతిభ పురస్కారం అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్
కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి అభివృద్ధి కమిటీ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 10వ తరగతిలోపు మంచి మార్కులు వచ్చిన వారికి ప్రతిభ పురస్కారాలు అందజేశారు. దానిలో భాగంగా ఎస్ఎస్‌సి 2024 ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించిన వన్నెల్ దాస్ లక్ష్య ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే వారి తల్లిదండ్రులను డాక్టర్ వన్నెల్ దాస్ శ్రీనివాస్, జోత్స్న దేవిలను అభినందించారు.

రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ


ఏర్గట్ల : జీలుగ పంపిణీ చేస్తున్న ఏవో


బాల్కొండలో...

నవతెలంగాణ-బాల్కొండ/ఏర్గట్ల/ముప్కాల్
రైతులకు 60శాతం రాయితీపై జీలుగ విత్తనాలు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమ్‌గల్ డివిజన్ ఎడిఎ కాంపాటి మల్లయ్య పాల్గొని రైతులకు పంపిణీ చేశారు. సొసైటికి 350 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సీడ్ కార్పొరేషన్ ద్వార సరఫరా చేశారు. 30 కిలోల బస్తా పూర్తి ధర 2790 రూపాయాలకు గాను రాయితీపై రూ.1116 ఇస్తున్నట్లు ఎడిఎ తెలిపారు. ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. ఈ జీలుగ ఉపయోగాలను ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రీయ కర్బనం పెరుగుతుందన్నారు. 15 నుండి 20 శాతం వరకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని సూచించారు. చౌడు భూములలో సాగు చేయడం వల్ల చౌడు ప్రభావం తగ్గే ఆస్కారం ఉంటుందని అన్నారు. పచ్చి రొట్ట ఎరువుల వాడడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మోహిద్ పాషా, ఎఇఓ నిహరిక, శ్రీకాంత్ రైతులు పెద్దగంగారాం, గంగధర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: ఏర్గట్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ చేతుల మీదుగా సోమవారం సంఘ పరిధిలోని రైతులకు సబ్సిడీపై వచ్చిన జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ... 30 కేజీల జీలుగ విత్తనాల ధర 2790 ఉందని దీనిని 60 శాతం సబ్సిడీ కింద తెలంగాణ ప్రభుత్వం 1116 అందిస్తుందని తెలిపారు. జీలుగ విత్తనాల కొనుగోలు కోసం పీఏసీఎస్‌కు వచ్చే రైతులు తమ వెంట తమ పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి సబ్సిడీ పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సంఘ సీఈఓ జక్కని శ్రీనివాస్,ఏఈఓ సాయి సచిన్,సంఘ సిబ్బంది సాయిబాబా,సాయి పవన్ సతీష్ గౌడ్,రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్: మండలంలోని రెంజర్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభించినట్టు రెంజర్ల సొసైటీ సెక్రటరీ కె.గంగాధర్ తెలిపారు. సొసైటీ ఆవరణలో కస్టర్ రైతులకు జీలుగా విత్తనాలు అందజేశారు. 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.2,790 రూపాయలు కాగా 60శాతం సబ్సిడీ ద్వారా ఒక బస్తా రూ.1,116కు అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ తెలిపారు. 30 కేజీల బస్తా ఒక హెక్టర్‌కు సరిపోతుందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సొసైటీ సీఈఓ కె.గంగాధర్, క్లస్టర్ రైతులు తదితరులు పాల్గొన్నారు..


ముప్కాల్‌లో...

ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడానికి గల ఆంతర్యం ఏమిటో..?

- రేవంత్‌రెడ్డి సర్కార్‌కు పీడీఎస్‌యూ సూటిప్రశ్న


మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ట్రిపుల్ ఐటి నోటిఫికేషన్ ఇప్పటి వరకు ఇవ్వకపోవడానికి కారణాలేంటని పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజామాబాద్ నగరంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పదోతరగతి పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 30న విడుదలయ్యాయని, 20 రోజులు గడిచినా ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడంలో గల ఆంతర్యం ఏమిటో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పష్టం చేయాలని కోరారు. ఫలితాలు విడుదలయ్యాక వెంటనే నోటిఫికేషన్ ఇస్తే ట్రిపుల్‌ఐటీలో అనేకమంది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందని, ఈ నోటిఫికేషన్ రాకపోవడం విద్యార్థులు ఆందోళన గురవుతున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ గడువు ప్రక్రియ ముంచుకొస్తున్న తరుణంలో విద్యార్థులు ఎదురుచూస్తున్నారని, కాబట్టి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క ఫీజుల దోపిడీ ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు అక్రమంగా అడ్మిషన్లు చేసుకుంటున్నాయని, వీటిని నియంత్రించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వీరి అడ్మిషన్లకు గండి కొట్టొద్దని కావాలని ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ ఆపినట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఇదే కనుక నిజమైతే కేసీఆర్ ప్రభుత్వం లాగానే రేవంత్ రెడ్డి నేతృతంలోని కాంగ్రెస్ సర్కార్ కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకే కొమ్ముగాసినట్లు స్పష్టమవుతుందని అన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ పదవ తరగతి పరీక్షల ఫలితాలు వెలువడిన వెంటనే ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ ఇచ్చిందని, అక్కడ లేని సమస్య ఇక్కడ ఎందుకు వస్తుందో స్పష్టం చేయాలని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ ఇవ్వాలని, అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి ల్యాప్‌టాప్ ఇవ్వాలని, యూనివర్సిటీలకి రెగ్యులర్ విసిలను నియమించాలని, గతంలో యూనివర్సిటీలో జరిగిన అవినీతి అవకతవకలపై జ్యూడిషియల్ ఎంక్వయిరీ వేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, నాయకులు సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని గొప్ప స్థాయికి ఎదగాలి

- రిటైర్డ్ సెక్రటేరియల్ అధికారి విక్రమ్ సింహారావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విక్రమ్ సింహారావు

నవతెలంగాణ-ఆర్మూర్
విద్యార్థిని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని గొప్ప స్థాయికి ఎదగాలని రిటైర్డ్ సెక్రటేరియల్ అధికారి విక్రమ్ సింహారావ్ అన్నారు. రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో జోరుగా హుషారుగా అనే కార్యక్రమాన్ని రోటరీ సభ్యుల సమేతంగా ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఇదిగా విచ్చేసి రోటరీ ఇంటర్నేషనల్ సంస్థలో భాగంగా ఆర్మూర్ క్లబ్బు అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ అధ్యక్షతన పది నెలల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలను చేయడం స్ఫూర్తిదాయకమని అభినందించారు. విద్యార్థులు నేటి యువతరం ఆలోచనతో ధ్యానంతో మంచి ఆహారపు అలవాట్లతో దినచర్యను కొనసాగిస్తూ ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని దైనందిక జీవన విధానంలో గొప్ప స్థాయిలో ఉండి దేశానికి సేవ చేయాలని సందేశాన్ని అందించారు. అనంతరం వారు స్వయంగా రచించిన ఆధ్యాత్మికత విద్యార్థి విజయ సోపానాలు తల్లిదండ్రులు పాత్ర వివిధ అంశాలపై రూపొందించిన పుస్తకాలను రోటరీ కార్యవర్గం కలసి ఆవిష్కరించారు. అనంతరం సైబ కిషన్, చౌకే లింగం జానపద హాస్య బుర్ర కథలు, నృత్యాలు వివిధ కళాకారుల ప్రదర్శన, మిమిక్రీ ఆకట్టుకున్నాయి. రోటరీ క్లబ్‌కి సేవలు అందించిన వారికి కుటుంబ సమేతంగా అధ్యక్షులు గోపీ కృష్ణ పట్వారీ సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పట్వారి తులసి కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ సభ్యులు విజయసారథి, పుష్పకర్ రావు, ప్రవీణ్ పవార్, రజనీష్, సురేష్, చొక్కా రాజారాం, కత్రజి రాజేందర్, చేలిమేల రాజు,, చౌటి లింబద్రి, ఖాందేశ్ సత్యం, రాము, శశిధర్, ఆనంద్, వినాయక్, బండారి ప్రసాద్, తదితులు పాల్గొన్నారు.

నేడు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారుల సమావేశం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారుల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తెలిపారు. ఈ నెల 25 నుండి జరగనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంట్ అధికారుల సమావేశం నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఖిల్లా)లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు అందరూ పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

లీగల్ మెట్రాలజీ సత్వరమే స్పందించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
నిజామాబాద్ వీక్లీ బజార్ మార్కెట్‌లో ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011పై చైతన్య కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 20మే నుండి జూన్ 3 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. తూనికలు, కొలతల శాఖ కేవలం కూరగాయల మార్కెట్లు, చేపల మార్కెట్లలో తనిఖీలకే పరిమితం కాదని అన్నారు. లీగల్ మెట్రాలజీ చట్టం 2009 రూల్స్ 2011 ప్రకారం, వినియోగదారులు నిత్య జీవితంలో వాడకం చేస్తున్న టీ, కాఫీ పౌడర్ మొదలుకొని పాల పౌడర్లు, బిస్కెట్‌లు, సూప్‌లు, వంటనూనెలు, బియ్యం బస్తాలు, ఉప్పు, సబ్బులు, కూల్ డ్రింక్స్, సిమెంట్ బస్తాలు, వాల్ పేయింట్స్ బహిరంగ మార్కెట్లో ప్రతీ వస్తువుపై పూర్తి సమాచారం వినియోగదారులకు అర్థమయ్యే భాషలో ఉండేలా తనిఖీలు నిర్వహించే భాధ్యత తూనికలు కొలతల శాఖదే నని తెలిపారు. పెట్రోల్ బంక్‌లు, వే బ్రిడ్జీలు, భూమి సర్వేలు, డాక్టర్లు ఉపయోగించే ధర్మా మీటర్‌లు, బిపి మిషన్లు, బార్ షాపుల్లో పెగ్ కొలతల్లో వినియోగదారులు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత లీగల్ మెట్రాలజీ (తూనికలు కొలతల శాఖ) దేనని సాంబరాజు చక్రపాణి గుర్తు చేశారు. బంగారు ఆభరణాల వర్తకులు ఇచ్చిన బిల్లులో నాణ్యత కు సంబంధించిన వివరాలు లేకపోతే 25వేల జరిమానా విధించే అధికారం లీగల్ మెట్రాలజీ ఉన్నదనీ, కాబట్టి వినియోగదారులు చైతన్య వంతులు కావాలని తెలిపారు. అనంతరం ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో అమ్మకం జరుగుతున్న వంటనూనెల ప్యాకింగ్‌లు నిబంధనలకు విరుద్ధంగా, వినియోగదారులను మోసగించే విధంగా ఉన్నాయని, బంగారు వెండి ఆభరణాలు అమ్మకం దారులు పక్కా రశీదులు ఇవ్వడం లేదని అన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులు సత్వరమే స్పందించి చర్యలు చేపట్టాలని, వినియోగదారుల సంఘాలతో కలిసి ముమ్మరంగా చైతన్య సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ ఆధ్వర్యంలో తూనికలు కొలతలు మరియు లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011 పోస్టర్ విడుదల చేశారు.

గుడుంబా విక్రయించిన ఏడుగురు బైండోవర్


ఎమ్మార్వో ముందు బైండోవర్ చేసిన ఎక్సైజ్ శాఖ పోలీసులు

నవతెలంగాణ-సిరికొండ
తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ఆప్కారి శాఖ వారు గుడుంబా విక్రయించిన ఏడుగురిని బైండోవర్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురిని తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో రవీందర్‌రావు ముందు ఎక్సైజ్ శాఖ వారు బైండోవర్ చేశారు. తహసిల్దార్ రవీంద్రావు మాట్లాడుతూ తూంపల్లి గ్రామం సర్పంచ్ తాండకు చెందిన ముగ్గురిని, పెద్దవాల్గోట్ గ్రామం సర్పల్లి తాండ కు చెందిన ఇద్దరిని, తాళ్లరామడుగు ఒడ్డెర కాలనీ, లొంక తాండకు చెందిన ఒక్కొక్కరిని బైండోవర్ చేశారని, గుడుంబా తయారు చేసి విక్రయిస్తే వారిపై లక్ష రూపాయల జరిమానా, జైలు శిక్ష కూడా తప్పవని అన్నారు. ఇలాంటి వ్యసనాలు మానుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ జీవనోపాది ద్వారా ఉన్నత స్థాయి లోకి రావాలని అన్నారు. ఎన్నికల సమయంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న వారిపై భీంగల్ ఎక్సైజ్ సీఐ వేణుమాధవ రావ్ దాడులు నిర్వహించి తొమ్మిది మందిని పట్టుకోగా ఏడుగురిని బైండోవర్ చేయడం ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ దత్తాద్రి తెలిపారు. మండలంలో గుడుంబా విక్రయాలు మునుముందు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో భీంగల్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ దత్తాద్రి, కానిస్టేబుల్ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు

మెడికవర్, కీర్తి సాయి హాస్పిటల్స్‌పై
క్రిమినల్ కేసులు పెట్టాలి

- బీఎల్‌ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
మెడికవర్, కీర్తి సాయి హాస్పిటల్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కీర్తి సాయి హాస్పిటల్‌లో నాలుగు నెలల గర్భిణి మృతికి కారణమంటు మృతురాలి బంధువులు హాస్పిటల్ ముందు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. అదేవిధంగా మెడికవర్ హాస్పిటల్ లో రెంజల్ మండలానికి చెందిన వ్యక్తి గుండె జబ్బుతొ హాస్పిటల్ చేరి సరైన సమయంలో చికిత్స అందకపోవడంవల్ల మృతి చెందినా కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు వసూలు చేశారని మృతుడి కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్ద ఫ్లకార్డులతో ఆందోళనకు దిగినా ప్రభుత్వ యంత్రాంగం ఇంతవరకు చర్యలు తీసుకోలేదని చెప్పారు. గతంలో కరోనా సమయంలో కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్‌పై వచ్చిన ఆరోపణలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటిసులు ఇచ్చినట్లు మీడియాలో వచ్చిందని ఆయన తెలిపారు. కానీ వాటిపై ఏమైనా చర్యలు తీసుకున్నారో లేదో ప్రజలకు మీడియా ద్వారా ప్రజలకు చెప్పాల్సిన అధికారులు ఇంతవరకు ఉలుకూపలుకు లేకుండా ఉన్నారని అన్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని మారుమూల గ్రామానికి చెందిన 23 సంవత్సరాల గంగాధర్ అనే యువకుడు ప్రమాదవశాత్తు బైక్ నుండి కింద పడి తలకు తీవ్రమైన గాయం కావడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణ న్యూరో సర్జన్ హాస్పిటల్‌లో చేర్పించారని, తలకు ఆపరేషన్ చేస్తే 23 సంవత్సరాల యువకుడు కోమాలోకి వెళ్ళాడని, అయినా సరే ఆక్సిజన్ ద్వారా చికిత్స అందించడం ద్వారా 3 లక్ష రూపాయలను హాస్పిటల్ యాజమాన్యం వసూలు చేసిందని పేర్కొన్నారు. ఇంకా డబ్బులు కావాలని హాస్పిటల్ యాజమాన్యం అడగడంతో వారికి అనుమానం వచ్చి ఇప్పటి వరకు చేసిన చికిత్స వివరాల రిపోర్ట్ ఇవ్వమని అడగడంతో ఆక్సిజన్ తొలగిస్తే పేషెంట్ చనిపోతాడని, ఇంకా హాస్పిటల్‌కు ఒక లక్ష 80 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో గంగాధర్ కుటుంబ సభ్యులు బిఎల్ఎఫ్ కార్యాలయానికి వచ్చి జరిగిన విషయాన్ని చెప్పడంతో హాస్పిటల్ యాజమాన్యాన్ని నిలదీయడంతో అచేతనంగా పడి ఉన్న గంగాధర్ బాడీని డబ్బులు ఇవ్వకుండానే ఇప్పించడం జరిగిందని దండి వెంకట్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ పిశాచాల్లా డబ్బులను దోచుకుంటున్నాయని, బాధితుల నుండి పిర్యాదులు వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు పౌర సమాజం అండగా నిల్చినప్పుడే కొంత మంది డబ్బు పిశాచాలకు బుద్ధి చెప్పొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

కబడ్డీ సమ్మర్ స్పెషల్ క్యాంపు ప్రారంభం


కబడ్డీ సమ్మర్ స్పెషల్ క్యాంపులో పాల్గొన్న బాలురు

నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ గ్రామీణ క్రీడా ప్రాంగణం 'చైతన్య నెహ్రూ యువజన సంఘం' క్రీడా మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కబడ్డీ సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో 'అండర్-16, అండర్-20 బాలుర' కు సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో ఎంపికైన 50 మంది క్రీడాకారులకు జూన్ 1 వరకు కబడ్డీ శిక్షణ తరగతులు 'సమ్మర్ స్పెషల్ క్యాంపు' కొనసాగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపీపీ సామ పద్మ 'కబడ్డీ సమ్మర్ స్పెషల్ క్యాంపు'ను ప్రారంభించారు. శిక్షణ కాలంలో క్రీడాకారులకు భోజన వసతి, ఆకామిడేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డిలతోపాటు రాజ్‌కుమార్, సుబ్బారావు, గంగారెడ్డి, హరి చరణ్‌ను ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, చైతన్య నెహ్రూ యువజన సంఘం చైర్మన్ అంజయ్య, ఎంపీటీసీ సభ్యులు పద్మ, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు టి.సాయన్న, గద్దల గంగారాం తదితర ప్రముఖులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చైతన్య నెహ్రూ యువజన సంఘం సభ్యులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు బెస్ట్ అవైలెబుల్ స్కూల్ స్కీమ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
బెస్ట్ ఆవైలెబుల్ స్కూల్ స్కీమ్ 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లీషు మీడియంలో 3వ, 5వ, 8వ తరగతిలో ప్రవేశం కోసం గిరిజన బాల బాలికల నుండి దరఖాస్తులు స్వీకరించబడం కోసం డిటిడిఓ కార్యాలయం నుండి దరఖాస్తుల ఉచితంగ పొందాలని తెలిపారు. బెస్ట్ ఆవైలెబుల్ స్కూల్ స్కీంలో ప్రవేశం కోసం తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.1.50 లక్షలు గ్రామీణ ప్రాంతాల వారికి 2 లక్షలు పట్టణ ప్రాంతాల వారికి అదాయం మించరాదని, కులం, ఆదాయ ధృవ పత్రం మీ-సేవా ద్వారా పొందిన ధృవపత్రాలు సమర్పించాలని, ఒక కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అవకాశం కల్పించబడునని అన్నారు. 3వ తరగతికి 26 సీట్లు 50 శాతం, 5వ తరగతికి 13 సీట్లు 25 శాతం, 8వ తరగతికి 13 సీట్లు 25 శాతం కేటాయించబడునని, 6 సీట్లు పిటిజి, జనరల్ విద్యార్థులకు 3వ తరగతి 5వ, 8వ తరగతి మొత్తం 58 సీట్లు ఉన్నాయని, మొత్తం సీట్లలో 33శాతం బాలికలకు కేటాయించబడునని తెలిపారు.

పిటిజీలు తప్ప 3వ తరగతిలో 26 సీట్లకు గాను బాలురకు 17, బాలికలకు 9 సీట్లు, 5వ తరగతిలో 13 సీట్లకు గాను బాలురకు 9, బాలికలకు 4 సీట్లు, 8వ తరగ తిలో 13 సీట్లకు గాను బాలురకు 9, బాలికలకు 4 సీట్లు, 3వ, 5వ, 8వ తరగతి లో పిటిజి కులాల విద్యార్థులకు 6 సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. మొత్తం 52 సీట్లు లంబాడాలకు, ఇతర కూలలు పిటిజిలకు 6 మొత్తం 58 సీట్లు కలవని, ఈ దరఖాస్తు ఫారాలను ఈనెల 21 నుండి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం, రూము నెం.118, మొదటి అంతస్తు, జిల్లా సమీకృత కార్యా లయం, నిజామాబాద్‌లో లభించునని, తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులు జూన్ 6 సాయంత్రం 5 గంటల వరకు తీసుకొనబడునని, జూన్ 12 ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్, చైర్మన్, సభ్యు ల సమక్షంలో లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు ఈ ఫోన్ నెంబరు 9912086022 కు సంప్రదించాలని పేర్కొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
మంగళవారం | మే 21, 2024 | www.navatelangana.com

అమ్మ ఆదర్శ పాఠశాలకు నిధులు మంజూరు



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయులు ఎస్.రామచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు గానూ 25 శాతం నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులు ఖాతాలో జమ అయి ఉన్నందున పాఠశాల పనులను ప్రారంభించాలని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పాఠశాల పున ప్రారంభం నాటికి అన్ని పనులు పూర్తి కావాలని ఆయన కమిటీకి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, సిఆర్‌పీలు శ్రీధర్ కుమార్, నర్సింలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3,5,8వ తరగతుల్లో ప్రవేశాలకై దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ

నవతెలంగాణ-కామారెడ్డి

బెస్ట్ అవైలబుల్ పథకం కింద 2024-25 విద్యాసంవత్సరంలో 3,5,8వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన అభివద్ధి అధికారి అంబాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో బాలురకు 7, బాలికలకు 4, 5వ తరగతిలో, బాలురకు 4, బాలికలకు 2, 8వ తరగతిలో బాలురకు 3, బాలికలకు 2 సీట్లు కలవని ఆయన తెలిపారు. ప్రవేశాల కోసం తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాలలో 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో ఒకటిన్నర లక్ష ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు వెంట ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డు, పూర్వపు తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, బోనఫైడ్ జతపరచి జూన్ 6న సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో గల 208 నెంబరు గదిలో ఉన్న జిల్లా గిరిజన అభివద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని అంబాజీ తెలిపారు. జూన్ 12న జిల్లా ఎంపిక కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కొరకు కార్యాలయ పనివేళలో సంప్రదించవలసిందిగా అంబాజీ తెలిపారు.

24లోగా కొనుగోలు పూర్తవ్వాలి

- ప్రతిరోజు లక్ష్యం నిర్దేశించుకుని ధాన్యం సేకరించి తరలించాలి
- కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రత్యేకాధికారి డా.శరత్



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఈ నెల 24లోగా పూర్తి చేయవలసినదిగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రత్యేకాధికారి డా.శరత్ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, పౌర సరఫరాల అధికారులు, సహకార శాఖ అధికారులు, ఐకెపి, ఆర్డీఓలు, వ్యవసాయ శాఖాధికారులు, తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతంగా చేస్తున్నారని, రైస్‌మిల్లర్లు కూడా సహకరిస్తున్నారని ప్రశంసిస్తూ ఇదే స్ఫూర్తితో అధికారులు సమన్వయంతో శుక్రవారం లోగా కొనుగోళ్ళ ప్రక్రి య పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొను గోలు చేసి కేంద్రాలను మూసివేసిన 180 కేంద్రాల సిబ్బం దిని, హమాలీలలను, తూకం యంత్రాలను వడ్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలకు తరలించి త్వరితగతిన మిల్లులకు తరలించేలా చూడాలన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తరలింపులో కాస్త ఇబ్బందులె దురైనా ప్రస్తుతం వాతా వరణం పొడిగా ఉన్నందున రోజు 10 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం తరలించుటకు నేటి నుంచి కొనుగోలు కేం ద్రాలు పగలు, రాత్రి పనిచేసేలా చక్కటి కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. తహసీల్దార్లు, వ్యవసాయా ధికారులు, ఎపిఎంలు బాధ్యత తీసుకొని కేంద్రాలను సందర్శించి కేంద్ర నిర్వహకులు వచ్చే నాలుగు రోజులల్లో పూర్తి ధాన్యం సేకరించేలా చూడాలన్నారు. మిల్లర్ల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని, సమయానుకూలంగా కేంద్రాలకు లారీలు సమకూర్చేలా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ కేంద్రాలలో, మిల్లులలో సకాలంలో లోడింగ్, అన్‌లోడింగ్ జరిగేలా చూడాలని మానిటరింగ్ అధికారులకు సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 97 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేసి 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి డబ్బులు చెల్లించామని ప్రత్యేకాధికారికి తెలిపారు. కాగా ఇందులో 230 కేంద్రాలలో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేశామని, అక్కడి హమాలీలను, తూకం కొలిచే యంత్రాలను వడ్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలకు తరలించి ప్రతి రోజు కొన్ని కేంద్రాల చొప్పున మిగిలిన 120 కేంద్రాలలో శుక్రవారం నాటికీ పూర్తిగా కొనుగోలు చేసే విధంగా రోజువారీ కార్యాచరణ రూపొందించి అధికారులతో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. అన్నిబాయిల్డ్ రైస్‌మిల్లులలో స్టోరేజి ఎంత ఉందో చూస్తూ మిల్లుల సామర్థ్యం మేరకు ధాన్యం తరలిస్తున్నామన్నారు. కాగా అడ్లూర్, తలమడలో పంట కోతలు నడుస్తున్నాయని ఇంకా 760 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశముందని వ్యవసాయాధికారులు తెలిపారని, ఆ ధాన్యాన్ని కూడా మిల్లులకు తరలించుటకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి రోజు కేంద్రం వారీగా ఎన్ని ధాన్యం కుప్పలు ఉన్నాయో మానిటరింగ్ చేస్తూ సింగిల్ డిజిట్ లారీలు అవసరమున్న త్వరగా ధాన్యం తరలించి మిగతా కేంద్రాలకు రోజు 10, 12 లారీల చొప్పున పంపుతూ వచ్చే నాలుగు రోజులలో ధాన్యం సేకరణ పూర్తయ్యే విధంగా చూస్తామని చెప్పారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో డీఎస్‌ఓ మల్లికార్జున్ బాబు, ఇంచార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం, వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, సహకార శాఖ అధికారులు ప్రశాంత్‌రెడ్డి, భూమయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ఐకెపి అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించాలి

- తిరిగి రుణాలు పొందండి
- ఏపిఎం చిన్నయ్య



మాట్లాడుతున్న ఏపిఎం చిన్నయ్య

నవతెలంగాణ-రెంజల్

బ్యాంకులో డ్వాక్రా గ్రూప్ మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు తీసుకోవాలని ఏపీఎం చిన్నయ్య కోరారు. సోమవారం మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనిధి రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని ఆయన సూచించారు. ప్రతి నెల డ్వాక్రా మహిళ సంఘాలకు సమావేశాలను ఏర్పాటు చేసి రుణాల రికవరీపై వారికి అవగాహన కల్పించాలని సీఏలను ఆదేశించారు. గ్రూపులో ఎవరైనా రుణాలు చెల్లించినట్లయితే వారి వద్ద నుంచి గ్రూపు సభ్యులతో వెళ్లి వసూలు చేయాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి మాధవి, కోశాధికారి లావణ్య, సిసిలు భాస్కర్, శివకుమార్, శ్యామల, కష్ణ, రాజయ్య, సునీత, కంప్యూటర్ ఆపరేటర్ తస్లీమా, అకౌంటెంట్ శారద, గ్రామ అధ్యక్షులు, అమ్మ ఆదర్శ పాఠశాలల అధ్యక్షులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ కామారెడ్డి

ధాన్యం కొనుగోల్లు వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జెసి చాంబర్‌లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా చేపట్టాలని సోమవారం ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్‌మిల్లుల ప్రతినిధులు, సహకార, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల యజమానులు ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయించుకోవాలని సూచించారు. సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 350 కొనుగోలు కేంద్రాలలో రూ.583 కోట్ల విలువైన 2.64లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతులకు ఖాతాలలో రూ.529 కోట్ల రూపాయలు జమ చేసినట్లు చెప్పారు. 97శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తయిందని వెల్లడించారు. రవాణా శాఖ అధికారులు లారీలను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, ఇన్చార్జి జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్, సహకార శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు, రుణాలు అందించాలి



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

వర్షాకాలం సమీపించడం వలన రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన విత్తనాలు బ్యాంకు రుణాలను త్వరగా అందించే ఏర్పాటు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం బోధన్ మండల అధ్యక్షులు పడాల శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం బోధన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 ఖరీఫ్ సీజన్‌కు రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించాలని కోరారు. రైతు రుణాలను ఏకకాలంలో రెండులక్షలు మాఫీ చేయాలని, నూతన రుణాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులు సిద్ధమవుతున్నారని, ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, జనుము, జీలుగు విత్తనాలను మాత్రమే పంపిణీకి సిద్ధం చేసిందని వీటితోపాటు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు మినీ ట్రాక్టర్ 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన, చిన్న, సన్నా కారు రైతులకు ఉచితంగా ఇవ్వాలన్నారు. దేశంలో ఇప్పటి వరకు ప్రభుత్వాలు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు 40 శాతానికి పైగా సబ్సిడీతో ఇచ్చారని, కానీ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలను రద్దు చేసి కార్పొరేట్ పెద్దలకు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం బోధన్ మండల ప్రధాన కార్యదర్శి సుల్తాన్ సాయిలు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సీతారాం, మండల నాయకులు సిహెచ్.గంగయ్య, పి.పోశెట్టి, డి.పోశెట్టి, పి.రాములు, సిహెచ్.పోశెట్టి, భీమ్‌రావ్, ఏ.గంగారాం, జి.లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

- కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన భర్త



రేణుక (ఫైల్)

నవతెలంగాణ-కామారెడ్డి

వివాహిత అదృశ్యమైంది. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి వివరాల ప్రకారం.. దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన సింగం పరుశురాములుకు ఆరోగ్యం బాగా లేకపోవడం వల్ల కామారెడ్డిలోని మెడికేర్ ఆస్పత్రికి ఈ నెల 19న రాత్రి 8 గంటలకు తన భార్య సింగం రేణుక (36)తో కలిసి వచ్చాడు. అక్కడ పరుశురాములు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా.. రాత్రి 11 గంటల సమయంలో ఆస్పత్రి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. దీంతో భర్త సింగం పరశురాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత దాడిలో దూడ మృత్యువాత



నవతెలంగాణ-రామారెడ్డి

దూడపై చిరుతపులి దాడి చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన కొయ్యల రవికి చెందిన దూడను బట్టు తండా పరిసర ప్రాంతంలో గల వ్యవసాయ క్షేత్రంలో చిరుత పులి దాడి చేయడంతో దూడ మత్యువాతపడింది. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం చెల్లించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

యథేచ్ఛగా ఉనుక తరలింపు

- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికులకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో పట్టపగలే ఉనక లారీలు ప్రయాణిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా లారీల్లో ఉనకను ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఉనుకను తరలించే సమయంలో గాలికి ఉనక లేచిపోయి లారీ వెనకాల ఉన్న ప్రయాణికుల మీద పడుతోంది. తద్వారా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉనుక లారీలతో ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



లారీలో తరలిస్తున్న ఉనుక

చెరువు వాల్‌ను రిపేరు చేయాలి

- ఆర్డీవోకు వినతి

నవతెలంగాణ-బోధన్

కోటగిరి మండలంలోని దామెర చెరువు సైడ్ వాల్స్ పగిలిపోయి అడుగుభాగం నుంచి నీరు లీకై పంట పొలాలు పాడవుతున్నాయని కావున పాడైన వాల్స్‌ను రిపేర్ చేయించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం ఆయకట్టు పరిధి రైతులు బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్డిఓను కలిసిన వారిలో రైతులు వడ్ల శ్యాంసుందర్, ఉమాకాంత్, భాస్కర్, రాములు, గజేందర్, హనుమండ్లు ఉన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-రెంజల్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులతో ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో 18 అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేయగా ఆ పాఠశాలలకు ప్రభుత్వం మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ నిధులను పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులకు జాయింట్ అకౌంట్‌పై ఖాతా బుక్కులు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌస్ ఉద్దీన్, ఏపీఎం చిన్నయ్య, మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి, ప్రధాన కార్యదర్శి మాధవి, కోశాధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు సోమవారం సబ్సిడీపై జీలుగా విత్తనాలు పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీలో 666 బస్తాలు, నల్లమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సొసైటీ పరిధిలో 166 బస్తాలు జీలుగా విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

అందుబాటులో జీలుగా విత్తనాలు..

నాగిరెడ్డిపేట్ : మండలంలోని మాల్ తుమ్మెద, తాండూర్ సొసైటీల పరిధిలో జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు సొసైటీ డైరెక్టర్లు తెలిపారు. జీలుగా విత్తనాలు అవసరమున్న రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వెళ్లి జీలుగు విత్తనాలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. రెండు సొసైటీల పరిధిలో 1332 బస్తాలు అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

నేడు జీలుగు, జనుము విత్తనాల పంపిణీ..

రామారెడ్డి : పచ్చిరొట్ట విత్తనాలు అయిన జీలుగు, జనుము విత్తనాలను మండలంలోని పోసానిపేట్, రామారెడ్డిలో రైతులకు అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సోమ హరీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాపాస్ బుక్ జిరాక్స్‌తో రావాలని, జీలుగు 30 కేజీల బస్తా 60శాతం సబ్సిడీతో రూ.1,116, జనుము 40 కేజీల బస్తా 60శాతం సబ్సిడీతో రూ.1448కి అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకొని, నేలను సారవంతం చేసుకోవాలని సూచించారు. అధిక దిగుబడి సాధించి లబ్ది పొందాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తి బుచ్చన్నగారి శంకర్ అను వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షను ప్రత్యేక జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ శ్రీప్రతాప్ విధించినట్టు పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించిన తర్వాత వాహనాలను నడపకూడదని అన్నారు. అలా నడిపితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

సంత స్థలం మార్పు



వేరేచోట ఏర్పాటు చేసిన సంత

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో గల శ్రీ లక్ష్మీనారాయణ రథోత్సవాలు ఈనెల 23, 24 తేదీలలో జరగనున్న నేపథ్యంలో రథోత్సవాలను పురస్కరించుకొని సోమవారం వారసంతను మార్పు చేసినట్టు వివరించారు. ప్రతి వారం సంత గాంధీ చౌక్ నుంచి మార్వాడి గల్లీ, పాత బస్టాండు మెయిన్ రోడ్డు గుండా సంత వ్యాపారాలు కొనసాగేవి. కానీ సోమవారం రథోత్సవాలను పురస్కరించుకొని సంత సంతోష్ మాత గల్లీ, దళితవాడ, శివాజీచౌక్ మెయిన్ రహదారి గుండా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తా

- పార్క్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ



పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని గోదాంరోడ్ మున్సిపల్ ఓపెన్ జిమ్ పార్క్‌ను ఆమె సందర్శించారు. పార్కులో ఉన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జిమ్‌లో సంబంధించిన పరికరాలను, మరమ్మతులు, పార్క్ అభివద్ధికి కషి చేస్తానని ఆ కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పాత శివ కష్ణమూర్తి, మహమ్మద్ సలీం, చాట్ల వంశీకష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక వాహనం

నవతెలంగాణ-పోతంగల్

పోతంగల్ మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని సంబంధిత అధికారులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

మార గంగారెడ్డికి సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

మోపాల్ కోపరేటివ్ సొసైటీలో ఇఫ్కో (ఎరువుల కంపెనీ)జాతీయ డైరెక్టర్‌గా ఎన్నుకోబడి నుండి మొదటి సారిగా విచ్చేసిన, తెలంగాణ రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోపాల్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి , బాడ్సి చైర్మన్ మోహన్ రెడ్డి, రాజశేఖర్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా నిర్వహిస్తున్న ఎరువుల నిల్వలు, పంట కొనుగోళ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భార్య కొడుతుంది

● అర్ధనగ్నంగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

నవతెలంగాణ-నసురుల్లాబాద్

భార్య కొడుతోందని ఓ భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీస్‌స్టేషన్లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. తడ్కోల్ గ్రామపంచాయతీ పరిధిలోని రాజారాం దుబ్బకు చెందిన బ్యాగరి గంగారాం (42) గత కొన్ని ఏండ్లుగా తడ్కోల్ గ్రామపంచాయతీలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బ్యాగారి గంగారాం.. తనను నిత్యం తన భార్య కొడుతుందని, భార్య చేసే చేష్టలకు నిరసనగా ఆదివారం సాయంత్రం రాజారాం దుబ్బ నుంచి బాన్సువాడ పోలీస్ స్టేషన్ వరకు అర్ధనగ్నంగా నడుచుకుంటూ వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనితో బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ కేసు నమోదు చేసి అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు పేర్కొన్నారు.



అర్ధనగ్నంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితుడు

నేటి నుంచి జిలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని ఐలాపూర్, డ్రాజ్ పల్లి సహకార సంఘాలలో రాయితీపై జిలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిని జ్యోస్నా భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బస్తా రాయితీ పోను రూ.1116 రైతులు చెల్లించాలని పేర్కొన్నారు. 30 కిలోల బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. రైతులు పట్టా పాస్ బుక్ ,ఆధార్ కార్డు, జిరాక్స్ తీసుకోని రావాలని తెలిపారు.

మండల వ్యవసాయ అధికారిగా వెంకటేష్

నవతెలంగాణ-ధర్పల్లి

మండల వ్యవసాయ అధికారిగా ప్రవీణ్ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. సిరికొండ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జె.వెంకటేష్‌ను ధర్పల్లి ఎఓగా అదనపు బాధ్యతలు అందిస్తూ సోమవారం వ్యవసాయ శాఖా ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఓ బాల కృష్ణ తెలిపారు.

రెండు రోజులు మిషన్ భగీరథ నీటిసరఫరాకు అంతరాయం

మున్సిపల్ కమిషనర్ రాజు

నవతెలంగాణ-ఆర్మూర్

మిషన్ భగీరథ ద్వారా పట్టణానికి తాగునీటి సరఫరా చేయనున్న దానిలో భాగంగా మంగళవారం, బుధవారం తాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్కొండ వద్ద గల నీటి శుద్ధి కేంద్రం వద్ద 500ఎంఎం పైపునకు లీకేజీ ఏర్పడిందని చెప్పారు. తిరిగి గురువారం నుంచి నీటి సరఫరా యధావిధిగా కొనసాగుతుందని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాధికారత కోసమే స్త్రీనిధి రుణాలు

● స్త్రీనిధి స్టేట్ జోనల్ మేనేజర్ అనంత కిషోర్


టెంట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ అనంతకిషోర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలన్న లక్ష్యంతోనే స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తున్నామని స్త్రీనిధి స్టేట్ జోనల్ మేనేజర్ అనంత కిషోర్ అన్నారు. సోమవారం మండలంలోని హాసకొత్తూరు లో మహిళా సంఘ సభ్యురాలికి స్త్రీనిధి ఐశ్వర్య పథకం క్రింద రు.4.50 లక్షల రుణంతో మంజూరు చేసిన టెంట్ హౌస్ ను స్టేట్ జోనల్ మేనేజర్ అనంత కిషోర్, కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల స్త్రీనిధి రీజనల్ మేనేజర్ గట్టు రామదాసు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి కింద మహిళా సంఘ సభ్యులు చేపట్టే ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు రూపాయలు 50 వేల నుంచి 5 లక్షల వరకు వ్యక్తిగత రుణం అందజేస్తున్నామని ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. మంజూరు చేసే రుణాలకు బ్యాంకు వడ్డీ కన్నా తక్కువ వడ్డీ ఉంటుందని బ్యాంకు వారు వేసే చార్జీల తో పోలిస్తే స్త్రీనిధి చాలా తక్కువ ఛార్జీలు ఉంటాయని, మహిళలు, చిరు వ్యాపారులు స్త్రీనిధి రుణాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కుంట గంగాధర్, సిసి నవీన్, మహిళలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రవాస భారతీయుల స్వచ్ఛంద సేవా సంస్థ "హెూప్ ఫర్ స్పందన" ఆధ్వర్యంలో సంస్థ 101 వ షాపు ని, డిచ్ పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామంలో ప్రమాద వశాత్తూ వెన్నెముకకు గాయమై ఏళ్ల తరబడి వీల్ చైర్ కే పరిమితమైన దివ్యాంగుడు సిహెచ్. జ్ఞానేశ్వర్ కి స్వయం ఉపాధి లో భాగంగా గ్రామంలో కిరాణా దుకాణం పెట్టించారు. దాదాపు లక్ష 1.50 వేల రూపాయల విలువతో కూడిన ఈ కిరాణా షాపుకోసం నార్త్ అమెరికా తెలుగు సంఘం (ఎన్ఏటీఎస్) వారు ఆర్థిక సహకారం అందించారు. దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 100 షాపులను పూర్తి చేసుకున్న హెూప్ ఫర్ స్పందన 101 షాపును ప్రవాస భారతీయులు, నార్త్ అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు బాపయ్య చౌదరి ప్రారంబించారు. సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మీ నరసింహం కోట పర్యవేక్షణలో రెండు తెలుగు రాష్ట్రాల సంస్థ సమన్వయకర్త డాక్టర్ రఘు ఆరికపూడి, సంస్థ సభ్యులు దయ్యాల మహేష్, గ్రామస్తుల సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా హెూప్ ఫర్ స్పందన వారి సహకారంతో తెలుగు రాష్ట్రాలలో పలురకాల సేవలను నార్త్ అమెరికా తెలుగు సంఘం నిర్వహిస్తున్నదని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు నిరుపేద దివ్యాంగ కుటుంబాలకు, మానసిక వికలాంగులకు అందిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద దివ్యాంగులకు నాట్స్ ద్వారా సేవలు అందించే అవకాశం రావడం చాలా గొప్పగా భావిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన హెూప్ ఫర్ స్పందన కి, నార్త్ అమెరికా తెలుగు సంఘం సంస్థ సభ్యులకు జ్ఞానేశ్వర్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జగదాంబ ఆలయం వద్ద అన్నదానం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ తండాలో జగదాంబ ఆలయం 3 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజల అనంతరం బంజారులు సోమవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా పెద్దలు బుక్య తిరుపతి నాయక్,మాలవత్ భీమా నాయక్,బుక్య శివ నాయక్,భాదవత్ శివ,మాలవత్ జగన్ నాయక్, బుక్య సంతోష్ నాయక్, భీముడు నాయక్, మంగ్య నాయక్, మోతీరం నాయక్, దయానంద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

● అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈ నెల 24 నుండి జూన్ 03 వరకు కొనసాగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ ఆదేశించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సోమవారం తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 17327 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 11282 మంది విద్యార్థులు హాజరుకానుండగా, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 6045 మంది హాజరుకానున్నారని వివరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని, ప్రతీరోజు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంట వరకు, తిరిగి సాయంత్రం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు కొనసాగుతాయని అన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల గురించి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవికుమార్ అదనపు కలెక్టర్ దష్టికి తెచ్చారు. ఇప్పటికే దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రతీ అంశాన్ని కూలంకషంగా పరిశీలిస్తూ తుది ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ, పోస్టల్, మెడికల్ అండ్ హెల్త్ తదితర లైన్ డిపార్ట్మెంట్ లకు చెందిన జిల్లా స్థాయి అధికారులను ఇప్పటికే సంప్రదించి ఏర్పాట్ల విషయమై సమాచారం అందించామన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, పరీక్షలు ప్రారంభం అయ్యే నిర్దీత సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని హితవు పలికారు. విద్యార్థులు తమ తమ కళాశాలల నుండి హాల్ టిక్కెట్లు పొందవచ్చని, నేరుగా వెబ్ సైట్ నుండి కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చని సూచించారు. కాగా, ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ ల వారీగా పోలీసు బందోబస్తు మధ్య తీసుకెళ్లాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, తగిన పోలీసు బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసిఉంచాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా రక్షిత మంచినీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకోవాలని, తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఆశా వర్కర్లు, ఏఎన్ఎం లను ఎగ్జామ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని, పరీక్షలు కొనసాగే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోనళకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించాలని అన్నారు. కాపీయింగ్ ను నిరోధించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలను ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

అలరించిన భారతి నృత్యానికేతన్ వారి ప్రదర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల భారతి నృత్యానికేతన్ విద్యార్థులు అత్యద్భుత ప్రదర్శన చేసినట్టు నాట్య గురువు సరోజ సుధీర్ ప్రియదర్శిని సోమవారం తెలిపారు. ఈనెల 17, 18 19 తేదీల్లో తిరుపతిలో గోవిందరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్టు చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భారతీ నృత్యానికేతన్ విద్యార్థులుతిరుమాడ వీధుల్లో స్వామివారి ఊరేగింపులో శ్రీ చంద్రశేఖర్ సరోజా శిష్య బృందం స్వామివారి సేవలో పాల్గొన్నారన్నారు. ఈ అవకాశాన్ని ఇచ్చిన ఆర్ట్ అండ్ కల్చర్ డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్వామివారి సేవలో విద్యార్థులు మాత్రమే కాదు వారి తల్లిదండ్రులు కూడా సేవ చేయడం జరిగిందని తెలిపారు. మణిపురి మోహిని, అట్టం, కూచిపూడి. గూమర్, తిరువతిరకాలి(ఓనం) వంటి నృత్య రీతులను చేసినట్టు చెప్పారు. ప్రదర్శనలో ఆర్మూర్, హైదరాబాదు నుంచి 70 మంది విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నట్టు తెలిపారు.


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరి పరిస్థితి విషమం


ప్రమాదం జరిగిన స్థలం, (మృతుడు మెంచు లక్ష్మణ్)

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ముందు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరోకరు తీవ్ర గాయాలతో జిల్లా కేంద్రంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎనుగందుల సునీల్, మెంచు లక్ష్మణ్ (30) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పాఠశాల పక్కన చెట్ల నీడ వద్ద నిలిపిన ట్రాక్టర్‌ను తీసే క్రమంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తులు ట్రాక్టర్ ను డీ కొనడంతో ఇరువురుకి బలమైన గాయాలు కావడంతో మెంచు లక్ష్మణ్ అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సునీల్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. సునీల్ పరిస్థితి విషమంగా ఉందన్నారు. మృతుడు లక్ష్మణ్‌కు ఇటీవలే వివాహం అయినట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒకే గ్రామనికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

లక్ష్మీ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లిలో సోమవారం శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు హృదయపూర్వ విశ్వక్సేన ఆరాధన, అగ్ని ప్రతిష్ట, గరుడ పటాధివాసము, ధ్వజారోహణము, దేవత ఆహ్వనము, బేరి పూజ అశ్వ వాహనంపై స్వామివారి ఎదుర్కోళ్లు అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అమర్నాథ చార్యులు, యజ్ఞాచార్యులు చౌట్‌పల్లి గంగాప్రసాద్ దీక్షితులు, గ్రామ కమిటీ, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వస్తువులు కొనుగోలు చేసినప్పుడు బిల్లు తీసుకోవాలి

● పాతగంజ్‌లో లీగల్ మెట్రాలజీ దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్‌నగరంలోని పాత గంజ్‌లో లీగల్ మెట్రాలజీ తూనికల కొలతల దినోత్సవం అసిస్టెంట్ కంట్రోలర్ నిర్మల్ కుమార్ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు మాయావర్ రాజేశ్వర్ మాట్లాడుతూ. తూనికల కొలతల విషయంలో వినియోగదారులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని కొనుగోలు చేయాలని, ఐఎస్ఐ అగ్‌మార్క్ లాంటివి మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. కొన్న తర్వాత వ్యాపారస్తులు వద్ద నుంచి బిల్లులు తీసుకోవాలని, బిల్లు ఉంటే కన్స్యూమర్ కోర్టులో కేసు వేయడానికి వీలుంటుందని అన్నారు. వ్యాపారస్తులు కిరాణా షాపుల్లో గాని సూపర్ మార్కెట్లలో గాని స్మార్ట్ మార్కెట్లలో గాని వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తూకం సరిగ్గా వేస్తున్నారా.. ఎలక్ట్రానిక్ కాంటాలు ద్వారా తూకం వేసినప్పుడు కరెక్ట్ గా ఇస్తున్నారా లేదా అని వినియోగదారులు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని తెలిపారు. ఎవరైనా వ్యాపారులు తక్కువ తూకం వేసి ఇస్తే అలాగే ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువకు అమ్మితే జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులకు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చని రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సుజాత అలీ, టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్ రావు, నరేష్, సుస్మిత్, వినియోగదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాయావార్ రాజేశ్వర్

ఆదర్శ పాఠశాల పనుల తనిఖీ


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజ శ్రీనివాస్, ఏపీఎం కుంట గంగాధర్ సోమవారం సందర్శించారు. మండలంలోని కొత్తచెరువు తాండ, వాసం గట్టు తాండ, ఇనాయత్ నగర్, నర్సాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న గదుల మరమ్మత్తు, మరుగుదొడ్ల మరమ్మత్తు, తాగునీటి సౌకర్యం, విద్యుదీకరణ పనుల తీరును పరిశీలించారు. జరుగుతున్న పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నెల 30 తేదీలోపు పనులన్నీ వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో సిసి శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో దాడులు చేస్తున్నారు..

● రక్షణ కల్పించి న్యాయం చేయండి

● బాధితుడు పులింటి శ్రీనివాస్



మాట్లాడుతున్న బాధితుడు పులింటి శ్రీనివాస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మంత్రాలు చేసి పశువులను, మనుషులను చంపుతున్నామని, తమను చంపాలని దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్య తీసుకోవాలి అని పులింటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ని మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో తమ ఇంటి పక్కన గల మొద్దోళ్ల శంకర్ తండ్రి లస్మయ్యకు చెందిన పశువులు తాము మంత్రాలు చేయడం వల్లనే చనిపోయాయని, మమ్మల్ని చంపితేనే పీడ పోతుందని పక్కా ప్రణాళిక ప్రకారం ఈనెల 11న సాయంత్రం సుమారు 07 గంటల సమయంలో మమ్మల్ని చంపడానికి కర్రలు, కత్తులు తీసుకొని మొద్దోల్ల శంకర్, ఆయన కూతురు సోనీ, భార్య పార్వతి మా ఇంటిపై దాడి చేశారు అని అన్నారు. గతంలో కూడా మా మీద దాడి జరిగినందున మా ఇంటి ముందు సిసి కెమెరాలు పెట్టామని తెలిపారు. వీటిలో రికార్డు కాకుండా ఉండటానికి కరెంటు నిలిపి వేసి మా పక్కింటి వారి వాకిట్లోకి మాట్లాడదామని పిలిచారన్నారు. తాము వెళ్లకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయి నా భార్య కళావతి, కుమార్తె భూలక్ష్మీని జుట్టు పట్టి ఈడ్చుకోని పక్కింటివారి వాకిట్లో కర్రలు, సీసాలతో వాడి చేసి తలపైన కర్రలతో మోదారన్నారు. సీసా పగలగొట్టి నా కుమార్తె భూలక్ష్మి గొంతులో పొడవడానికి రావడంతో చేయిని అడ్డంపెట్టగా కుడి చేయికి గాయమై రక్తస్రావం జరిగిందన్నారు. నా భార్య కళావతిపై కర్రలతో నెత్తిమీద దాడి చేయడం వల్ల కేకలు వేసినా పక్కింటివారు, ఎదురింటివారు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయకపోగా నవ్వుతూ వారిని రెచ్చగొట్టారన్నారు. ఎందుకుంటే వీరే తమను మంత్రాగాళ్లు అని ప్రచారం చేశారని ఆరోపించారు. తాను ప్రతి అమావాస్య, పౌర్ణమికి నగ్నంగా క్షుద్ర పూజలు చేస్తానని మా వదిన సత్తెవ్వ అల్లు పడుతూ ఎవరైనా మంత్రాలు చేసారా అని తెలియజేస్తూ మేమే మంత్రగాళ్ళమని అమాయక ప్రజలకు చెప్పి నమ్మించి తమపై దాడులకు ప్రేరేపిస్తున్నారని వాపోయారు. ఈ విషయమై వర్ని పోలీస్ స్టేషన్‌లో గతంలో కూడా పలుమార్లు ఫిర్యాదు చేసిన రాజకీయ పలుకుబడి. కలిగిన వ్యక్తులతో అర్థబలం, అంగబలం గల వ్యక్తులతో తమపై దాడి చేయించి ఫిర్యాదులను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. కనీసం మాతో ఎవరు కూడా మాట్లాడకుండా మేము ఏ దారి నుండి కూడా నడపకుండా కర్రమొద్దులను అడ్డం వేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఈనెల 11న ఫిర్యాదు చేశామన్నారు. ఏఎస్ఐ ఒక్కరే ఉండి సరిగ్గా ఫిర్యాదు రాయలేదని, తరువాత ఎమ్మెల్సీ రాసిఇచ్చి హాస్పిటల్ యందు చూయించుకోవాలని పంపారని తెలిపారు. చికిత్స అనంతరం సిబ్బంది ఎవరూ లేనందున ఈనెల 14న పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఎస్ఐ లేరని నామ మాత్రపు కేసు నమోదు చేసి దాడిచేసినవారిని పిలిపించమని, కోర్టులోనే చూసుకోమని అన్నారని చెప్పారు. మిమ్మల్ని కొట్టగా చూసిన సాక్షులను తీసుకొని పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎస్ఐ ఒత్తిడి చేయడం జరుగుతుందన్నారు. మా కుటుంబానికి ప్రాణ హాని ఉన్నందున రక్షణ కల్పించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరారు..

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-దోమకొండ

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లింగుపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన గుర్రపు వెంకటి (50) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కుటుంబ సభ్యులందరూ కలిసి షిరిడీకి దర్శనం కోసం వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులోని చెరువులో కుమారుడితో కలిసి బట్టలు ఉతకడానికి వెళ్లాడు. బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి నీటమునిగి మృతిచెందాడు. మృతుని కుమారుడు గుర్రపు నరేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని వడ్డేపల్లి గ్రామంలో నల్ల పోచమ్మ బోనాల సందర్భంగా సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా నల్ల పోచమ్మ పండుగ సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ కుస్తీ పోటీలకు మల్లయోధులు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చి కుస్తీ పోటీల్లో తలబడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రజాపండరి, మాజీ ఉప సర్పంచ్ అంజయ్య, మాజీ ఎంపిటిసి రాజారాం, వార్డ్ మెంబర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం

- వానాకాలం పంటల ప్రణాళిక ఖరారు
- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు



ట్రాక్టర్‌తో దుక్కి చేయిస్తున్న రైతు



నారు పోసిన దృశ్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

వానాకాలం (ఖరీఫ్) సీజన్ పంటల సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఏ పంట ఎంత మేరకు సాగుకానున్నది..?, ఇందుకు అనుగుణంగా ఏ రకం విత్తనాలు ఎంత మేరకు అవసరం అవుతాయో అంచనాలను రూపొందించారు. గత సీజన్ కంటే ఈసారి వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశమున్నట్టు అంచనా వేశారు.

తొలకరి వర్షాలపై ఆశలు..

నిజాంసాగర్ సాగునీటి ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు, బోరుబావులపై ఆధారపడి బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో ఇప్పటికే రైతులు నారుమల్లు వేసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం మే చివరి వారంలో నారుమల్లు వేసుకునేందుకు ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నారుమడుల సాగు కోసం నీటిని విడుదల చేసేవారు. ఈసారి చెరువుల కింద బోరుబావుల కింద కొందరు రైతులు ఇప్పటికే నారుమల్లు వేసుకున్నారు. మే, జూన్ మాసంలో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

బాన్సువాడ డివిజన్‌లో వానాకాలంలో ప్రతియేటా ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. వీటితో పాటు కంది, పెసర, మినుము, సోయాబీన్ తదితర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఈసారి తొలకరిలోనే వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో అన్నదాతలు వానాకాలం సీజన్‌పై ఆశలు పెంచుకున్నారు.

అంచనాలకు మించి పంట సాగు..

బాన్సువాడ డివిజన్ పరిధిలో వరి, మొక్కజొన్న, ఇతర పంటలను సాగు చేసేందుకు రైతులు ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు చేపట్టారని బాన్సువాడ డివిజన్ వ్యవసాయ అధికారులు సూచించారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో ఉన్న అధిక వ్యవసాయ భూములు నిజాంసాగర్ ప్రధాన కాలువ నీటిపైనే ఆధారపడి ఇక్కడి రైతులు వ్యవసాయం సాగు చేస్తారు. వరి పంటకు కావలసిన సాగునీరు ఉందని అధికారులు సూచించడంతో ఈసారి అంచనాల గురించి అధిక పంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు.

విత్తనాలు, ఎరువులపై దృష్టి..

సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచడానికి వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూరు మండల కేంద్రంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న ఎరువుల షాపులో నకిలీ మందులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అలాగే మిర్జాపూర్ గ్రామంలో కూడా నకిలీ విత్తనాలు, ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. బాన్సువాడ పట్టణంలోని ఎరువుల దుకాణంలో కాలం చెల్లిన ఎరువులను, విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని ఎరువుల షాపు యజమానికి నోటీసులు ఇచ్చారు.

అందుబాటులో జనుము, జీలుగ విత్తనాలు..

నసురుల్లాబాద్, బాన్సువాడ మండల కేంద్రాల్లో రైతులకు కావలసిన విత్తనాలను అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు సూచించారు. అలాగే జనుము, జీలుగు విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అలాగే అవసరమైన ఎరువుల కోసం అధికారులు యాక్షన్‌ప్లాన్ రూపొందించారు.

బస్సుల కోసం నిరీక్షణ



బస్సులో కిక్కిరిసిపోయిన ప్రయాణికులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో సోమవారం బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు నిరీక్షించారు. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. వచ్చిన పలు బస్సుల్లో ప్రయాణికులు నిండుగా ఉండటంతో బస్సులను ఆపలేదు.

నేడు ట్రాఫిక్ రూల్స్‌పై శిక్షణా శిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల అశోక్‌గార్డెన్‌లో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహనా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు కామారెడ్డి పోలీసులు తెలిపారు. హైవే పక్కన గల దాబాలు, హొటల్స్, మెకానిక్ షాపులు, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ యూనియన్ ప్రతినిధులు తదితరులు హాజరుకావాలని పోలీసులు సూచించారు.

ఖాతాలో నుంచి రూ.50 వేలు మాయం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



బాధితుడు ఆదిరెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని అయ్యపల్లి గ్రామానికి చెందిన చల్ల ఆదిరెడ్డి అనే యువ రైతు తన ఖాతాలో నుంచి రూ.50 వేలు కోల్పోయాడు. వివరాలి ఉన్నాయి.. ఆదివారం ఉదయం బాధితుని బ్యాంక్ ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.50 వేలు చోరీ చేశారు. సెల్‌ఫోన్‌లోని మొబైల్ బ్యాంక్ ఖాతాను హ్యాక్‌చేసి రూ.25 వేలు ఒకసారి.. మరోసారి రూ.25 వేలు, రెండు దఫాలుగా సైబర్ మోసగాళ్లు నగదు చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆటలతో ఆయుష్షు



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఆటలతో ఆయుష్షు మెరుగుపడుతుందని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న మై11 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నరసయ్య, కన్నె సురేందర్, శివసాయి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సాయి హాజరై మాట్లాడుతూ.. ఆటల పోటీలతో ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని అన్నారు. ఈ కాలం పిల్లలు ఫోన్లతో కాకుండా ఈ ఆటల ద్వారా శారీరకంగా మానసికంగా ఎంతో బలవంతులుగా మారుతారని, మానసిక ఉల్లాసం లభిస్తుందని భీంగల్ జడ్పీటీసీ రవి అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని టోర్నమెంట్ నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతగా నిలిచిన ఆర్‌సిఏ టీం దూదిగం జట్టుకు దాత బాల్కొండ ఎంఎల్ఏ ప్రశాంత్‌రెడ్డి అందించిన రూ.18 వేల నగదును, రెండో స్థానంలో నిలిచిన హసకొత్తూర్ జట్టుకు దాత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బొంగు పరమేశ్వర్ అందించిన రూ.8 వేల నగదుతో పాటు ట్రోఫీని విజేత జట్టుకు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిన్నోళ్ల సుమలత రాజేశ్వర్, మాజీ సర్పంచ్ కోనపత్రి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సంగెం శ్రీకాంత్, గడల ప్రసాద్, గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటితో ఫ్లోరైడ్ సమస్యలుండవు

- అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నిజాంసాగర్

మిషన్ భగీరథ నీటితో ఫ్లోరైడ్ సమస్యలుండవని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అచ్చంపేట గ్రామపంచాయతీ పరిధిలోని మర్పల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీటి వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ కూడా మిషన్ భగీరథ నీటిని తాగాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయబడే నీరు ఫిల్టర్ చేయబడి పోషకాలు సమృద్ధిగా ఉండి ఫ్లోరైడ్ సమస్యలు రాకుండా, అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ మోటార్ల ద్వారా సరఫరా చేయబడే నీటి కంటే 100 రేట్లు మంచినీరని ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రజలందరూ మిషన్ భగీరథ నీరు మాత్రమే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి బిక్షపతి, మంచినీటి సరఫరా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ శ్రీకాంత్, ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో యాదగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

- వ్యవసాయ శాఖ అధికారిణి కమల



జీలుగా విత్తనాలు పంపినీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండలంలోని దామరంచ సహకార సంఘం పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 60 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువు, జీలుగ విత్తనాలను సోమవారం మండల వ్యవసాయాధికారి కమల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రస్తుతం మండలంలోని మిర్జాపూర్, బీర్కూర్ సహకార సంఘంలో 166 బస్తాలు, దామరంచ సంఘంలో 166 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక్కో బస్తా 30కేజీలు బరువుతో ఉంటుందని ఈ విత్తనం రెండున్నర ఎకరాలకు సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారిని కమల తెలిపారు. ఎకరానికి జీలుగ 12కిలోలు వేసుకుంటే సరిపోతుందని అన్నారు. 30కేజీల బస్తా ధర రూ.2790 ఉండగా.. ప్రభుత్వ రాయితీ రూ.1674 పోను.. రైతు రూ.1116 చెల్లించి బస్తాను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ రాయితీ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పొందటానికి రైతులు పట్టేదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు సహకార సంఘంలో ఇచ్చి రాయితీపై జీలుగా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారిణి బైరాపూర్ ఏఈఓ కావ్యశ్రీ, సీతఈఓ జాకీర్, విఠల్, సొసైటీ సిబ్బంది సాయిలు, రైతులు ఆవారి రాజు, ఏనుగుపట్ల సాయిలు, గంగాధర్, మారుతి, కాజా, సత్యనారాయణ, ఆంజనేయులు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

సమయపాలన పాటించని సాలూర పిహెచ్‌సీ వైద్యులు..

- రోగులకు తాగునీరూ కరువే
- ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని రోగుల వేడుకోలు



సమయానికి వైద్య సిబ్బంది రాక ఖాళీగా ఉన్న కుర్చీలు



తాగునీరు లేక వృథాగా ఉన్న వాటర్ ప్యూరిఫైర్



సాలూరా ఆస్పత్రి భవనం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారుతున్నారు. రోగులకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించవలసిన ఈ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంతో సమయపాలన పాటించకుండా విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులలో ఉండవలసిన వైద్య సిబ్బంది 10:30 తర్వాత సాఫీగా విధులకు హాజర వుతుండడంతో రోగులు వారి కోసం నిరీక్షించవలసి వస్తుంది. వైద్య సిబ్బంది పనులను పర్యవేక్షించ వలసిన సూపర్వైజర్లు కూడా సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. సోమవారం నవతెలంగాణ సాలూరు పిహెచ్‌సీని పరిశీలించగా 10:30 అయినా.. వైద్య సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ఒకే ఒక్క ఏఎన్ఎం 9 గంటలకు విధులకు హాజరయ్యారు. 10:30 వరకు మిగిలిన ఏ ఒక్కరు కూడా ఆస్పత్రి విధులకు రాలేదు. ఇద్దరు సూపర్‌వైజర్లు ఉన్నా.. సమయానికి రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. 10:30 తర్వాత జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, డాటా ఆపరేటర్ విజయ్, ల్యాబ్ టెక్నీషియన్ మాత్రమే వచ్చారు. ఆసుపత్రిలో ఎవరు పనిచేస్తున్నారో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియకుండా పోతుందని గ్రామస్తులు అంటు న్నారు. అలాగే మరో ఏఎన్ఎం సక్రమంగా విధులకు హాజరు కాకుండా తాను ఉన్నచోట నుంచి విధులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. అయినా కూడా ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నా యి. నిత్యం సుమారు 100 మంది వరకు రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. అత్యవసరంగా మందులు వేసుకునే వారికి కనీసం తాగునీరు కూడా అందుబా టులో ఉండడం లేదు. చల్లని తాగునీరు అందించే ఏర్పాటు ఉన్నా అందులో తాగునీరు లేకపోవడంతో వృథాగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రి నిర్వహణపై దృష్టి సారించాలని, సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కేనా..?

46 ఏండ్లుగా జుక్కల్ నియోజకవర్గానికి దక్కని మంత్రి పదవి

- ఈసారైనా దక్కుతుందేమోనని ఎదురుచూస్తున్న నియోజకవర్గ ప్రజలు



నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతోంది. రానున్న రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరుగనున్నట్టు ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. అయితే ఈసారి జరగబోయే మంత్రివర్గ విస్తరణలో జుక్కల్‌కు చోటు దక్కేనా అని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు. ఈ నియోజకవర్గం ఏర్పడి 46 సంవత్సరాలు అవుతుంది. నాటి నుంచి నేటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా.. మంత్రి పదవి దక్కడం లేదు. 1978లో జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా ఏర్పడింది. నాటి నుండి నేటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు గానీ ప్రత్యేక రాష్ట్రంలో గానీ ఈ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కని పరిస్థితి. అధికారాన్ని సాధించుకున్న ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే ఇక్కడి నుంచి గెలుపొందినప్పటికీ ఎస్సీ రిజర్వుడు ఎమ్మెల్యేగా గుర్తించకపోవడం మంత్రి పదవి ఇవ్వకపోవడంతో జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందడంలో పూర్తిగా వెనుకబడి ఉందనేది పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తే వెనుకబడ్డ జుక్కల్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా తోట లక్ష్మీ కాంతారావు గెలుపొందారు. మంచి విద్యావేత్త. ఇలాంటి వ్యక్తికి మంత్రి పదవి ఇస్తే వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.